తెలంగాణ ధిక్కారస్వరం దాశరథి

- *తెలంగాణ పోరాటంలో దాశరథి స్ఫూర్తి*
- *దాశరథి శతజయంతి సందర్భంగా కేసీఆర్*

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ తన కవిత్వం ద్వారా తెలంగాణ గరిమను ప్రపంచానికి చాటి, తన సాహిత్యం ద్వారా తిమిరంతో సమరం చేస్తూ, నాటి రైతాంగంలో రాచరికానికి వ్యతిరేకంగా సాయుధ పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి దాశరథి' అని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ కొనియాడారు. తెలంగాణ సాధనకోసం తాను సాగించిన పోరాట పంథాలో దాశరథి అందించిన స్ఫూర్తి ఇమిడి ఉన్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కారస్వరం, అభ్యుదయ కవి రచయిత, దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తిని స్మరించుకున్నారు. మహోన్నతమైన దాశరథి గొప్పతనాన్ని గుర్తించి, ఆయన స్ఫూర్తి కొనసాగే దిశగా, వారి జయంతి రోజున, తెలంగాణ సాహిత్యంలో లబ్ధప్రతిష్ఠులకు ప్రతియేటా అందించేందుకు 'దాశరథి కృష్ణమాచార్య అవార్డు'ను తమ ప్రభుత్వ హయాంలో నెలకొల్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అత్యున్నత శిఖరాల మీద నిలబెట్టే దాశరథి కవిత్వం, సాహిత్యం తెలంగాణ భవిష్యత్తు తరాలకు నిత్యస్ఫూర్తిదాయకమని కేసీఆర్ పేర్కొన్నారు.

తెలంగాణ భవన్‌లో దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్, తదితరులు

రవీంద్రభారతిలో ప్రముఖ కవి జూకంటి జగన్నాథంకు దాశరథి కృష్ణమాచార్య అవార్డును ప్రదానం చేసి సత్కరిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, తదితరులు

తెలంగాణ ఉద్యమానికి దాశరథి స్ఫూర్తి

- **నిజాం ప్రభుత్వంపై తిరగబడిన గొప్ప కవి**
- **దాశరథి శతజయంతి ఉత్సవాల ప్రారంభ సభలో దేశపతి**
- **మహాకవికి ఘన నివాళులర్పించిన ప్రముఖులు**

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరులో దాశరథి శత జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న దేశపతి శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ తదితరులు

మహబూబాబాద్/చిన్నగూడూరు, జూలై 22(నమస్తే తెలంగాణ): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి దాశరథి స్ఫూర్తినిచ్చారని, నిజాం కాలంలో ప్రజలు అనుభవించిన కష్టాలను, రైతుల బాధలను తన కవిత్వాలల్లో ప్రతిబింబేంచేలాచేయడమే కాకుండా నిరంకుశ పాలనపై తిరుగుబాటు చేసేలా చైతన్యపరిచిన అక్షర పోరాటయోధుడు దాశరథి అని ప్రముఖ కవి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన దాశరథి శతజయంతి ప్రారంభ సభను ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. అంతకుముందు చిన్నగూడూరు మండల కేంద్రంలో దాశరథి సంస్మరణ సభ నిర్వహించారు. ఎమ్మెల్సీ తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్, కవి, రచయిత, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రముఖ కవి నందిని సిధారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ)రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీతోపాటు కవులు, కళాకారులు, రాజకీయ ప్రముఖులు, ఉద్యమకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. దాశరథి సోదరుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దాశరథి చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కళాకారులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సంస్మరణ సభలో పలువురు ప్రముఖులు మాట్లాడుతూ.. మహనీయుడి స్వగ్రామం చిన్నగూడూరును సందర్శించి వేడుకల్లో పాల్గొనడం తమ అదృష్టంగా భావిస్తున్నట్టు చెప్పారు. ఉద్యమ శక్తిగా, వేదాల అనువాదకుడిగా, సినీగేయ రచయితగా దాశరథి కీర్తి హిమాలయ శిఖరమంత ఎత్తుకు ఎదిగిందని గుర్తు చేశారు. అనంతరం చిన్నగూడూరు నుంచి బైక్ ర్యాలీగా మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి తరలివెళ్లారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ..'తెలంగాణ అంటే దాశరథి.. దాశరథి అంటే తెలంగాణ' అనేలా కృషి చేశారని గుర్తు చేశారు. అద్భుతమైన పద్యాలు, పాటలు, కవితలతో సమాజాన్ని మేల్కొల్పిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. 'ఈ నేల, ఈగడ్డే కాదు ఈ దేశం రైతులదే' అని ఎలుగెత్తి చాటాడాని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనపై వ్యతిరేకంగా ఒంటరి పోరాటం చేసిన దాశరథి కృష్ణమాచార్య చరిత్ర భావితరాలకు తెలిసేలా కృషి చేయాలని కోరారు. చిన్నగూడురు మండలానికి దాశరథి మండలంగా నామకరణం చేయడంతోపాటు దాశరథి పేరిట లైబ్రరీ, కాంస్య విగ్రహం, స్మృతివనం ఏర్పాటు, ఏడాదిపాటు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణకు ఎమ్మెల్సీ రవీందర్‌రావు ముందుకు వచ్చారని, ప్రభుత్వ సహాయంతోపాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో దాశరథి సేవలు భావితరాలకు గుర్తిండిపోయేలా చేస్తాననడం అభినందనీయమని ఎమ్మెల్సీని కొనియాడారు. ప్రజలను బానిసలుగా చూడటం, చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయించడం, రైతు, రైతుకూలీల కష్టనష్టాలను వేయి కన్నులతో పరిశీలించి వారి కన్నీటిని కలం గుండెల్లో నింపుకొని కవితలు రాశాడని గుర్తు చేశారు.

రెండు రాష్ట్రాల్లో ఉత్సవాలు నిర్వహించాలి

దాశరథి కేవలం తెలంగాణకే చెందిన కవి కాదు.. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రజాకవి. ఆయన శతజయంత్యుత్సవాలను రెండు రాష్ట్రాల్లో నిర్వహించేలా ఆయా ప్రభుత్వాలు కృషి చేయాలి. నిజాం దాష్టికాలను చూసి చలించిన దాశరథి తన పద్యాల రూపంలో ఆయనపై నిప్పులు చెరిగేవారు. చిన్నగూడురుకు చెందిన ఒక దొర దాశరథిని చంపాలని చూస్తే వెళ్లి గార్లలో ఉన్నారు. అక్కడ కూడా వారి అరాచకాలపై గర్జించిన సింహం దాశరథి. దాశరథి ప్రజల కోసం పడ్డ కష్టాలు అన్ని ఇన్నీ కావు. ఆయన ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచించే గొప్ప వ్యక్తి.

- నందిని సిధారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు

భావితరాలకు తెలిసేలా కార్యాచరణ

నిజాం నిరంకుశ పాలనపై అవిశ్రాంత పోరాటం చేసి తన రచనలతో ప్రజలను చైతన్యపరిచిన దాశరథి కృష్ణమాచార్యుల చరిత్రను దేశవ్యాప్తం చేయాలి. భూస్వాములు పెత్తందార్లకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి పద్యాన్ని ఆయుధంగా ప్రయోగించిన ఘనుడు దాశరథి. ఈ గడ్డపై అణువణువు దాశరథి జ్ఞాపకాలు నిండుకుని ఉన్నాయి. తొలి తెలంగాణ ఉద్యమంలో అతని పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శం. ఆ మహనీయుడి శతజయంతి వేడుకలను సంవత్సరమంతా నిర్వహిద్దాం. ఆయన పుట్టిన ఈ గడ్డకు దాశరథి చిన్నగూడూరుగా నామకరణం చేసేందుకు, గ్రంథాలయం, దాశరథి స్మృతివనం ఏర్పాటుకు గ్రామస్తులు ఆసక్తిగా ఉన్నారు.

- రవీందర్‌రావు, ఎమ్మెల్సీ, దాశరథి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

పోరాట కవియోధుడు దాశరథి

ఎక్స్‌వేదికగా కొనియాడిన కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని ఎలుగెత్తి చాటిన మహనీయుడు, సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నివాళులర్పించారు. పద్యాన్ని ఆయుధంగా మలిచి పీడిత ప్రజలపక్షాన పోరాడిన యోధుడు దాశరథి అని ఎక్స్‌వేదికగా కేటీఆర్, హరీశ్‌రావు కొనియాడారు. ప్రజల గొంతుకగా నిలిచి తెలంగాణ బిడ్డల్లో ఉద్యమస్ఫూర్తిని నింపిన మహాకవి దాశరథి అని పేర్కొన్నారు. సాహితీ రంగంలో విశేష కృషి చేసిన వారికి దాశరథి సాహితీ పురస్కారాన్ని కేసీఆర్ అందచేయడం ప్రారంభించారని గుర్తుచేశారు. ప్రతి ఏడాది దాశరథి జయంతిని అధికారికంగా నిర్వహించామని తెలిపారు. ప్రముఖ మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు శత జయంతిని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ స్పీకర్ ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్,మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పూలమాల వేసి నివాళులర్పించారు. మధుసూదనాచారి మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారికి స్ఫూర్తి నింపడంలో ఆయన రచించిన 'అగ్నిధార' కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని దాశరథి అన్నట్టుగా తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా కేసీఆర్ చేశారని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాకుంటే తెలంగాణ కవులను గుర్తించే వారు కాదని శ్రీనివాస్‌గౌడ్ వాపోయారు. తెలంగాణ సాధనలో దాశరథి స్ఫూర్తి కనపడుతుందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాయకులు అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి,నాయకురాళ్లు తుల ఉమ, ముక్తవరం సుశీలారెడ్డి పాల్గొన్నారు.

నూతన న్యాయ చట్టాలపై మీ వైఖరేంటి?

- ***వీటితో ప్రాథమిక హక్కులకు విఘాతం***
- ***కొన్ని రాష్ట్రాల్లా సవరణలు కోరుతారా?***
- ***లేదంటే యథావిధిగా అమలు చేస్తారా?***
- ***అదే జరిగితే నిరంకుశ పాలన అవుతుంది***
- ***ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ***

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): కేంద్రం తెచ్చిన నూతన న్యాయ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి స్పష్టం చేయాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈనెల 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చిన మూడు చట్టాలపై దేశవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతున్నదని పేర్కొన్నారు. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఏఏ) స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బీఎస్ఏ) చట్టాలపై ఆందోళన వ్యక్తం అవుతున్న నేపథ్యంలో ఉద్యమాల అడ్డాగా ఉన్న తెలంగాణ ప్రజాస్వామ్య హక్కుల కోసం ఉక్కు పిడికిళ్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాయని తెలిపారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్ణాటక సహ పలు రాష్ట్రాలు ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నాయని, కాబట్టి తెలంగాణ ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బహిరంగ లేఖ విడుదల చేశారు.

వ్యక్తి స్వేచ్ఛను హరించేలా చట్టాలు

నూతన చట్టాలు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని హక్కుల సంఘాలు చేస్తున్న నిరసనను ఈ సందర్భంగా కేటీఆర్ ఉదహరించారు. నూతన చట్టాలతో పౌరుల హక్కులకు హాని కలిగించే అంశాలను ఆయన లేఖలో ప్రస్తావించారు. ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం కొత్త చట్టాల ప్రకారం నేరమని, ఇది అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న 15 రోజుల పోలీసు కస్టడీని 90 రోజులకు పెంచడం, వ్యవస్థీకృత నేరాల విషయంలో వ్యక్తులను ప్రాసిక్యూట్ చేయడానికి దర్యాప్తు సంస్థలకు ఏకపక్ష, విచక్షణ అధికారాలను కొత్త చట్టం అనుమతినిస్తున్నదని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థ, పౌరహక్కుల విషయంలో నూతన చట్టాలు అత్యంత దారుణంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా? లేదా? అనే విషయాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించాలని కోరారు. ఈ చట్టాల్లోని నియంతృత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రాష్ట్ర శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ ప్రభుత్వాన్ని నిరంకుశ, ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా ప్రజలు పరిగణిస్తారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కేటీఆర్ హెచ్చరించారు.

కేటీఆర్ విడుదల చేసిన బహిరంగ లేఖ పూర్తి పాఠం... ఎడిటోరియల్ పేజీలో..

రుణమాఫీ కంటే డంబాచారానికి ఎక్కువ ఖర్చు

- **అదొక మిస్టరీలా మారింది**
- **మేడిగడ్డ నీటిని విడుదల చేయాలి**
- **ఈసారి కూడా పొలాలు ఎండబెడితే సహించం**
- **మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**

మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, జూలై 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ పెద్ద మిస్టరీలా మారిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ఇప్పటివరకు చేసిన రుణ మాఫీ కంటే కాంగ్రెస్ ప్రభుత్వం అడ్వర్టైజ్‌మెంట్లు, క్షీరాభిషేకాలు, సంబురాల వంటి డంబాచారాలకే ఎక్కువ ఖర్చు పెట్టినట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ.. లక్షలోపు రుణమాఫీ 20% మందికి కూడా పూర్తికాలేదని దుయ్యబట్టారు.

బటన్ నొక్కితే కాళేశ్వరం జలాలు వస్తాయి

వ్యవసాయం, సాగునీటిపై సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ సర్కారులో ఎవరికీ అవగాహన లేదని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. గత యాసంగిలో మేడిగడ్డ ప్రాజెక్టు కొట్టుకుపోతుందంటూ విషప్రచారం చేసి రైతులకు అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు మేడిగడ్డ నుంచి లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నా ప్రాజెక్టు చెక్కు చెదరకుండా ఉన్నదని, అయినా ఒక్క బటన్ నొక్కి వ్యవసాయానికి నీటిని వదలాలనే ఆలోచన చేయడం లేదని పేర్కొన్నారు. ఇది రైతులను నట్టేట ముంచే కుట్రగా కనిపిస్తున్నదని మండిపడ్డారు. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు.యాసంగి మాదిరిగా ఈసారి కూడా వ్యవసాయాన్ని ఎండబెడితే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. గోదావరి జలాలను వృధాగా పోనీయకుండా కాళేశ్వరం వద్ద మోటర్ల బటన్ నొక్కి నీటిని పంపింగ్ చేసి తక్షణమే సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

సర్కారు వైఫల్యాలపై సమరమే

> మొదటిపేజీ తరువాయి...

ప్రభుత్వంపై ఒత్తిడి తేవడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నది. ప్రతిపక్షంలో ఉండగా ఆయా వర్గాలను మభ్యపెట్టి, అధికారంలోకి రాగానే అన్నింటినీ అమలు చేస్తామని అలవికాని హామీలు ఇచ్చి ఇప్పుడు చేతులెత్తేస్తున్న కాంగ్రెస్‌పై తీరును ఎండగట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 200 రోజులు దాటింది. 100 రోజుల్లోనే 6 గ్యారెంటీలు, 13 హామీలను అమలు చేస్తామని ప్రకటించింది. అయితే ఇవేవీ అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వం మాత్రం అన్నింటినీ అమలు చేశామని చెప్తున్నది. రుణ మాఫీ విషయంలో ముఖ్యమంత్రి చెప్తున్న దానికి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న దానికి ఎక్కడా పొంతన కుదరడం లేదని, వాస్తవాలు వేరేలా ఉంటే రైతులను మభ్యపెట్టేలా వ్యవహరిస్తున్నారని, అర్హులైన రైతులను తగ్గించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, అనేక షరతులు విధిస్తున్నదని ఆరోపిస్తున్నది. నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి వాటిలో ఒక్కటి కూడా అమలుచేయడం లేదని, వారి డిమాండ్ల కోసం నిరసన తెలిపితే పోలీసులతో లాఠీచార్జీలు చేయిస్తున్నారని మండిపడింది.

వీటన్నంటినీ సభలో చర్చకు వచ్చేలా చేయాలని బీఆర్ఎస్ నిర్ణయించింది.

అసెంబ్లీలో బీఆర్ఎస్ లేవనెత్తే ప్రధాన అంశాలు

1) నిరుద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, జాబ్ క్యాలండర్ విడుదల కోరుతూ ఉద్యమించిన ఉద్యోగార్థులపై ప్రభుత్వ దమనకాండ
2) శాంతిభద్రతల నిర్వహణలో వైఫల్యం
3) చేనేత కార్మికుల ఆత్మహత్యలు.. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి
4) ఆరు గ్యారెంటీల అమలు.. శాసనసభలో చట్టబద్ధత
5) రైతు రుణమాఫీ అమలులో ఆంక్షలు-నష్టపోతున్న రైతాంగం
6) పంటల మద్దతు ధరకు అదనంగా బోనస్ చెల్లింపుపై ప్రభుత్వ వైఫల్యం-రైతు భరోసా చెల్లింపులో జాప్యం వల్ల రైతాంగం ఎదుర్కొంటున్న ఇబ్బందులు
7) గ్రామాలు, పట్టణాలకు నిధుల విడుదలలో అలసత్వం - పారిశుధ్య నిర్వహణ సరిగా లేక కుంటుపడుతున్న ప్రజారోగ్యం
8) ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో జాప్యం ఫలితంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు

నేడు బీఆర్ఎస్ఎల్పీ సమావేశం

మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ఎల్పీ సమావేశం ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన జరుగుతుంది. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశంలో చర్చిస్తారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేస్తారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు, పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహాన్ని ఖరారు చేస్తారు.

రేపు బీఆర్ఎస్ రక్తదాన శిబిరాలు

కేటీఆర్ బర్త్‌డే సందర్భంగా బీఆర్ఎస్ విద్యార్థి, యువజన విభాగాల పిలుపు

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం (ఈనెల 24న) రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్టు పార్టీ విద్యార్థి, యువజన విభాగాలు తెలిపాయి. ఈ మేర కు విద్యార్థి, యువజన విభాగాల రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. బుధవారం ఉదయం 10 గంటలకు తెలంగాణభవన్‌లో నిర్వహించే మెగారక్తదాన శిబిరంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరా రు. అలాగే జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మొక్క లు నాటాలని, రక్తదానం చేయాలని, దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేయాలని సూచించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, పదేండ్లపాటు మంత్రిగా కేటీఆర్ అందించిన సేవలను గుర్తుచేశారు. రాష్ట్రానికే కాకుండా యావత్ దేశానికే వన్నెతెచ్చిన నేతగా కేటీఆర్ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారని పేర్కొన్నారు.

ఫార్మా ఉత్పత్తుల్లో తెలంగాణ వాటా 30%

ఎక్స్ వేదికగా బీఆర్ఎస్ నేత క్రిశాంక్

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ) : భారతదేశ ఫార్మా ఉత్పత్తుల్లో 30శాతం వాటా తెలంగాణ నుంచే ఉన్నట్టు సాక్షాత్తూ భారత ప్రభుత్వం విడుదల చేసిన ఎకనామిక్ సర్వే చెబుతున్నదని బీఆర్ఎస్ నేత క్రిశాంక్ సోమవారం ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. బీఆర్ఎస్ హయాంలో లైఫ్ సైన్సెస్‌కు తెలంగాణ కేరాఫ్‌గా ఉన్నదని, నాడు 1000 లైఫ్ సైన్సెస్ కంపెనీలు వచ్చాయని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఫార్మాసిటీని ప్రారంభిస్తే దాన్ని మూసివేసేందుకు కాంగ్రెస్ సర్కార్ ప్రయత్నిస్తున్నదని చెప్పారు. తన వ్యాఖ్యలకు భారత ప్రభుత్వం విడుదల చేసిన ఎకనామిక్ సర్వే రిపోర్టును జత చేశారు.



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఉదారత

- **అగ్ని ప్రమాద బాధితులకు జీతంలో నుంచి ఆర్థికసాయం**
- **31మందికి రూ.3.10 లక్షలు**

హుజూరాబాద్, జూలై 22 : కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఉదారత చాటుకున్నారు.ఈ నెల 15న హుజూరాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన చిరు వ్యాపారులకు సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ప్రమాదస్థలమైన పాపారావు బొంద వద్ద 31మంది బాధితులకు రూ.10 వేల చొప్పున రూ.3.10లక్షల చెక్కులను జీతంలోంచి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాలు దగ్ధమై రోజులు గడుస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఒక్కో బాధితుడికి రూ.లక్ష పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వీణవంక మండలం మామిడాలపల్లి అనుబంధ గ్రామం గొల్లపల్లిలోని బ్రిడ్జ్ పూర్తిగా పాడైందని, మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ కేసీరెడ్డి లావణ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం.. గంజాయికి గుమ్మం!

- **గుట్టుచప్పుడు కాకుండా ఈ జిల్లా గుండా తరలింపు**
- **ఏపీ, ఒడిశా నుంచే అత్యధిక శాతం అక్రమ రవాణా**
- **ఐదేండ్లలో ఖమ్మంలోనే 8,622 కేజీల పట్టివేత**



మే 27న డీసీఎం వాహనంలో తరలిస్తున్న గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని చూపిస్తున్న కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు (ఫైల్)

హైదరాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా ఏటేటా పెరుగుతున్నది. ఏ సరిహద్దు చెక్‌పోస్టు చూసినా గంజాయి వాసన గుప్పుమంటున్నది. ఇన్నాళ్లూ గోదావరి పరవళ్లు, పచ్చని అభయారణ్యాలు, బొగ్గు గనుల కేంద్రంగా, గ్రానైట్ మాగాణిగా పేరున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా.. ఇప్పుడు గంజాయి అక్రమ రవాణాకు ముఖ ద్వారంగా మారింది. ఆంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు కలిగిన ఖమ్మం.. గంజాయి అక్రమ రవాణాలో కీలకంగా మారింది. ఏవోబీ(ఆంధ్రా ఒడిశా బార్డర్)లో సాగవుతున్న గంజాయిని ఖమ్మం ద్వారానే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత ఐదేండ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 8,622 కేజీల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారంటే అక్రమ రవాణా ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఒడిశా, ఏపీ సరిహద్దులో ఎకరానికి రూ.లక్ష చొప్పున పెట్టుబడి పెట్టి కొందరు అక్రమార్కులు గంజాయి సాగు చేస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులే చెబుతున్నారు.

8,622 కేజీల పట్టివేత

ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ సిబ్బంది 2020లో 7 కేసుల్లో 43 కేజీలు, 2021లో 26 కేసుల్లో 472 కేజీలు, 2022లో 161 కేసుల్లో 2999.73 కేజీలు, 2023లో 204 కేసుల్లో 3574.46 కేజీలు, 2024లో జూన్ నాటికి 100 కేసుల్లో 1533.268 కేజీల చొప్పున మొత్తం ఐదేండ్లలో 498 కేసుల్లో 8,622.508 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇక తెలంగాణ వ్యాప్తంగా 2022లో 4,556 కేజీలు, 2023లో 6,355 కేజీలు, 2024(జూన్ వరకు)2,283 కేజీల గంజాయిని పట్టుకున్నట్టు సంబంధిత అధికారులు వెల్లడించారు.

సరిహద్దుల్లో గట్టి నిఘా

గంజాయిని అరికట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టాం. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మంపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి వినియోగం, రవాణా, అమ్మకాలపై కఠినంగా వ్యవహరించాలనే ఆదేశాల మేరకు ఎక్సైజ్ సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నది. గంజాయి అక్రమ రవాణా గురించి ఎవరికైనా తెలిస్తే ఎక్సైజ్ టోల్‌ఫ్రీ నంబర్ 18004252523కు ఫిర్యాదు చేయండి. వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

- వీబీ కమలాసన్‌రెడ్డి, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్